క్లుప్తంగా

వైద్యశాలలో పారిశుద్ధ్య పనులు


పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న సూపరింటెండెంట్, ఎంపీడీఓ

కంభం: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆదివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. శుక్రవారం వైద్యశాలను మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా తనిఖీ చేసిన సమయంలో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, కార్యదర్శి ఆదివారం వైద్యశాలలోని శానిటేషన్ పనులు చేపట్టారు. పరిసరాలను శుభ్రపరిచి ట్రాక్టర్ ద్వారా వ్యర్థాలను తొలగించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్ పర్యవేక్షించారు.

మన్ కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నేతలు


మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం టౌన్: ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక బీజేపీ నాయకులు ప్రసార మాధ్యమాల్లో వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ ఇన్‌చార్జి కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రధాని సూచనల మేరకు ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తామని, అమ్మ పేరు మీద మొక్క నాటి సంరక్షిస్తామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మీ, ప్రవీణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మతల్లి

మార్కాపురం టౌన్: ప్రసిద్ధిగాంచిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి పోలేరమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

రాకపోకలకు తీవ్ర అవస్థలు


మురికికూపంగా మారిన పాఠశాల రోడ్డు

అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలోని పాపినేనిపల్లెలో ఉర్దూ పాఠశాల రోడ్డు మురికికూపంగా మారింది. చిన్నపాటి వర్షం పడిన వర్షం నీరు రోడ్డుపై చేరి నిల్వ ఉండటంతో మురికిమయంగా మారుతోంది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, మసీదుకు వెళ్లేందుకు కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దోమలు విపరీతంగా వృద్ధి చెందడంతో జ్వరాలు బారిన పడుతున్నామని, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని రోడ్డుపై మురికినీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, కాలనీవాసులు కోరుతున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కంభం: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కమిటీని ఆదివారం గుర్రపుకొండ నరసింహులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గంజి వీరయ్య, చైర్మన్‌గా గుర్రంకొండ నరసింహులు, అధ్యక్షుడిగా వెంకటశివారెడ్డి, ఉపాధ్యక్షులుగా మూర్తయ్య, ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా గాదంశెట్టి శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా వెంకటేశ్వర్లు, సోషల్‌మీడియా కన్వీనరుగా డాక్టర్ మొర్రి పిచ్చయ్య, తదితరులను ఎన్నుకున్నారు. కమిటీ ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలు చేయనున్నట్లు సభ్యులు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం


గౌతవరం గ్రామ సమీపంలో పూర్తిగా ఒరిగిపోయిన 11కేవీ విద్యుత్ స్తంభం


అనుమలవీడు, ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామాల్లో కూలేలా ఉన్న విద్యుత్ స్తంభాలు

రాచర్ల: గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో విద్యుత్ తీగలు నేల కూలడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. సమస్యలపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదనే పలువురు రైతులు విమర్శిస్తున్నారు. మండలంలోని రాచర్ల, అనుమలవీడు, గంగంపల్లె, ఆకవీడు, జేపీ చెరువు, ఆరవీటికోట, ఓబుల్‌రెడ్డిపల్లె, గౌతవరం, ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామాల్లోని పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు పూర్తిగా ఒరిగిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. విద్యుత్ స్తంభాలు పూర్తిగా ఒరిగిపోవడంతో అయా పొలాలకు సంబంధించిన రైతులు ప్రాణాలు అరచేతితో పెట్టుకుని పొలం పనులు చేసుకుంటున్నారు. మరిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు చెట్ల తీగలు అల్లుకుని ఉండటంతో షార్ట్ సర్క్యూట్ వచ్చి ఫీజులు కాలిపోతున్నాయి. సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో రాత్రి సమయాల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడంలో లేక అంధకారంలో మగ్గుతున్నామని, పలు గ్రామాల ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ విద్యుత్ బిల్లులు, సర్‌చార్జీల పేరిట వినియోగదారులపై మోపడంతో తప్ప సమస్యలు గురించి పట్టించుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు చర్యలు తీసుకుని ఒరిగిపోయి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.


ఓబుల్‌రెడ్డిపల్లెలో విద్యుత్ స్తంభాలకు అల్లుకుని పోయిన చెట్ల తీగలు

భౌభౌతో భయం భయం!

- మార్కాపురంలో వీధి కుక్కల బెడద
- బెంబేలెత్తుతున్న పట్టణ ప్రజలు


మార్కాపురంలో సంచరిస్తున్న వీధి కుక్కలు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో చిన్నపిల్లలు, వృద్ధులు రహదారిపై వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ కంటికి కనబడిన వారిని కసితీరా కరిచేస్తున్నాయి. గుడిని, బడిని దేన్నీ వదలకుండా వీధికుక్కలు జనవాసాల మధ్య ఆవాసాలు ఏర్పాటు చేసుకుని రాజ్యమేలుతున్నాయి. ఇటీవల కాలంలో మార్కాపురం పట్టణంలో వీధి కుక్కల బెడద మరింత ఎక్కువైంది. పట్టణంలోని ఎస్సీ బీసీ కాలనీ, పూలసుబ్బయ్య కాలనీ, ఇండో ఫ్యాక్టరీ లైన్, కోర్టు సెంటరు, శ్రీనివాస థియేటర్ ఏరియా, నెహ్రూ బజారు, విజయటాకీస్ ఏరియా, మెయిన్ బజారు.. ఇలా పట్టణంలోని ప్రతి ప్రాంతంలో వీధి కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు కనబడితే కరిచేందుకు మీదకు వస్తున్నాయంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీధికుక్కల బెడద నుంచి విముక్తి కల్పించాలని మున్సిపల్ సిబ్బందికి విజ్ఞప్తి చేసినా స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇదిలా ఉండగా గ్రామాల్లో కూడా వీధి కుక్కల బెడద ఎక్కువైంది. చింతగుంట్ల, తిప్పాయపాలెం, నికరంపల్లి, గజ్జలకొండ, బోడపాడు, దరిమడుగు, రాయవరం తదితర గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువ కావడంతోపాటు చిన్నపిల్లలను కరుస్తున్నాయి. గత వారం రోజుల క్రితం చింతగుంట్లలో ఓ పిచ్చికుక్క ఐదుగురిని కరిచింది. బయట ప్రాంతాల నుంచి ఉదయం పూట బస్సు దిగి వచ్చే వారిని కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. మార్కాపురం జీజీహెచ్‌కు కుక్క కాటు బాధితులు తరచూ వచ్చి వ్యాక్సిన్ వేయించుకుని వెళ్తున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి కుక్కల బాధ నుంచి తమను రక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కోట సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోట సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోట సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర


పోలేరమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న గ్రామస్తులు

దొనకొండ: మండలంలోని చందవరం పంచాయతీ పరిధి దేశిరెడ్డిపల్లెలో గ్రామస్తులు కుల మతాలకు అతీతంగా ఆదివారం పోలేరమ్మ జాతర ఘనంగా జరుపుకున్నారు. వర్షాలు పడాలి, పంటలు పండాలని గ్రామ దేవత పోలేరమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. ఆడ పడుచులు పోలేరమ్మ దేవతకు పొంగళ్ళు చేసి నైవేద్యం సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పోలేరమ్మ జాతరలో పాల్గొన్నారు. గ్రామస్తులు జాతరకు విచ్చేసిన వారికి భోజనాలు ఏర్పాటు చేశారు.

వేములకోటలో ఘనంగా పీర్ల పండగ


వేములకోటలో పీర్ల ఊరేగింపు

మార్కాపురం రూరల్: మండలంలోని వేములకోట గ్రామంలో గత మూడు రోజులుగా పీర్ల పండగను భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి పెద్ద సరిగెత్తు సందర్భంగా పీర్లచావిడి దగ్గర నిప్పుల గుండంలో పలువురు భక్తులు పీర్లను ఎత్తుకుని నడిచారు. వేములకోట, కొట్టాలపల్లి, వేములపేట గ్రామాల్లో ఆదివారం పీర్లను ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పీర్లకు బొరుగులను నైవేద్యంగా సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భక్తులు సందడి చేశారు. వేములకోటలో సంప్రదాయం ప్రకారం కొందరు భక్తులు వివిధ వేషధారణలతో అలరించారు.

మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించాలి

త్రిపురాంతకం: మార్కాపురాన్ని జిల్లా చేస్తామని ప్రకటించిన అధికార పార్టీ వెంటనే ఆ ప్రక్రియ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. త్రిపురాంతకం సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో మార్కాపురం వచ్చిన సందర్భంగా మార్కాపురాన్ని జిల్లా చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే దీనిపై ఇప్పటికీ ఎటువంటి ప్రకటన ఇంతవరకు రాలేదన్నారు. ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలుకు వెళ్లాలంటే ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీపీఐ మండల నాయకుడు బి. రామయ్య, నయీమ్ బేగ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన ఖాజావలి

ముండ్లమూరు: మండలంలోని పోలవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ముండ్లమూరు గ్రామానికి చెందిన షేక్ ఖాజావలి ఎలక్ట్రిక్ స్కూటర్‌పై ఆదివారం అద్దంకి బయలు దేరాడు. మార్గ మధ్యంలో దర్శి- అద్దంకి ప్రధాన రహదారిలో పోలవరం వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న పాల ట్యాంకర్‌ను ఢీ కొట్టాడు. అతని తలకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు, పరిస్థితి విషమంగా మారటంతో ఒంగోలు తరలించారు. సమాచారం తెలుసుకున్న ముండ్లమూరు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

మృతురాలికి బూచేపల్లి నివాళి

దర్శి: ఎంపీపీ గోళ్ళపాటి సుధారాణి అత్త నరసమ్మ అనారోగ్య కారణంగా ఆదివారం మృతి చెందింది. ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.


నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

చినుకు లేక చింత


గుడిపాడులో విత్తడానికి సిద్ధం చేసిన పొలం

దొనకొండ: మండల పరిధిలో వ్యవసాయానికి గడ్డు పరిస్థితులు దాపురించాయి. ఖరీఫ్ సీజన్ కావడంతో గ్రామాల్లో రైతన్నలు పొలాల్లో విత్తనం విత్తడానికి ఇప్పటికే ఏర్పాట్లు సిద్ధం చేశారు. కానీ ఈ సీజన్ నెల దాటినా తీవ్రంగా ఎండలు కాస్తున్నాయి. దీంతో వాన ఎప్పుడు పడుతుందో.. పొలంలో విత్తనాలు ఎప్పుడు నాటాలో అనే ఆందోళన మొదలైంది. ఈ నేలపై కంది, ఆముదాలు, పత్తి సాగు చేస్తారు. వినుకొండ, నరసరావుపేట, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లి ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చు చేసి విత్తనాలు కొనుగోళ్లు చేశారు. దొనకొండ మండలంలో వర్షాధార పంటలే అనుకూలం. కానీ మే, జూన్, జూలైలో కాసిన ఎండలకు భూగర్భ జలాలు తగ్గడంతో చెరువులు, కుంటలు ఎండి పోయాయి. మరికొంతమంది వాణిజ్య పంట అయిన మిరప, పొగాకు సాగు చేయడానికి నారు పోశారు. రైతన్నల పరిస్థితి అలా ఉంటే పశుగ్రాసం లేకుంటే గేదెలకు తిప్పలు తప్పవు, తాగు నీరు ఎక్కడ నుంచి తేవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ట్రాక్టర్ గడ్డి రూ.20 వేలు పలుకుతోంది. పంటలు పండుతాయా లేదా.. అప్పులు తీరతాయా లేదా.. శుభకార్యాలు చేయగలమా లేదా అని రైతన్నలు లబోదిబోమంటున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ఎంపీడీఓ చంద్రశేఖర్
- హాస్టల్ విద్యార్థులకు ఇన్వర్టర్, దుప్పట్లు అందజేత


ఇన్వర్టర్ అందిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్, అధికారులు

తర్లుపాడు: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. ఆదివారం స్థానిక ఎస్సీ హాస్టల్‌ను మండలంలోని పంచాయతీ సెక్రటరీలతో కలిసి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. బాగా చదువుకుని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని సూచించారు. జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు సౌకర్యకు తమ వంతుగా 60 వేల విలువైన ఇన్వర్టర్, 130 దుప్పట్లను పంచాయతీ సెక్రటరీలతో కలిసి వార్డెన్ వెంకటరెడ్డికి అందించారు. హెచ్‌ఎం సుధాకర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాలకృష్ణ, కలుజువ్వలపాడు జెడ్పీ హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు గోను శ్రీనివాసులు, కోటి మోహన్, సీఆర్‌ఎం టి.ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు శుభాకర్ బాబు, బట్టు శ్రీనివాసులు, ఆర్ పెద్దిరాజు, వీఆర్‌ఓ విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పోలేరమ్మ తల్లి పొంగళ్లు


పూజలందుకుంటున్న యల్లమ్మతల్లి

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు గ్రామంలో శనివారం రాత్రి, ఆదివారం గ్రామ దేవత పోలేరమ్మతల్లికి గ్రామస్తులు ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. కుంకుమ బండ్లు, బోనాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. సకాలంలో వర్షాలు పడి గ్రామం పాడిపంటలతో కళకళలాడాలని అమ్మవారికి పూజలు చేశారు. అలాగే గ్రామ దేవత యల్లమ్మతల్లికి పొంగళ్లు పెట్టి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


బోనాలతో భక్తులు

ఎస్సీ హాస్టల్ తనిఖీ


స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ

కంభం: హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం పరిశుభ్రమైన భోజనం అందించాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. స్థానిక రంగరాజు స్కూల్ పక్కన ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఆదివారం తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వంటశాల, రూంలు, తరగతి గదులు, నిల్వఉన్న కూరగాయలు పరిశీలించి స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిల్లలకు మినరల్‌వాటర్ అందించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. జ్వరం, ఇతర సమస్యలు ఉంటే వార్డెన్ దృష్టికి తీసుకొచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు. చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీగా ఉండాలి

ముండ్లమూరు: అధికారులు జవాబు దారీగా పని చేయాలని ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మారెడ్డి సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశపు మందిరంలో ఆదివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. పథకాల చేరివేతలో రాజకీయాలకు తావివ్వద్దని కోరారు. పారిశుధ్య చర్యలు చేపట్టి వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలని.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను కట్టడి చేయాలన్నారు. తూర్పు కంభం పాడు, నూజెళ్ల పల్లి, జమ్మలమడకలో విద్యుత్‌శాఖ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవడం లేదని తమ మాటలు కూడా ఖాతరు చేయడంలేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈదరలో పశువైద్యాధికారి లేరని ఎంపీటీసీ ఎస్. అంకారావు తెలిపారు. ఎంపీడీఓ జనార్దన్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సమావేశానికి గైర్హాజరు అయిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

సభ్యులు కాని వారు వెళ్లిపోవాలి..

సర్వసభ్య సమావేశానికి మహిళల స్థానంలో వారి తరపు బంధువులు హాజరు కావడంతో వెళ్లిపోవాలని ఎంపీడీఓ సూచించారు. ప్రజలచే ఎన్నికైన ప్రజా ప్రతినిధులే సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

పటిష్ట బందోబస్తు

సర్వసభ్య సమావేశం నిర్వహణ ముందు రోజు పలువురు ఎంపీటీసీ పార్టీ ఫిరాయించటంతో సర్వసభ్య సమావేశం ఉన్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 15 మంది పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్ రెడ్డి, సీఐ సమీముల్లాలు ముండ్లమూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీఓ జనార్దన్, ఇన్‌చార్జి తహసీల్దార్ జి. పుల్లా రెడ్డి, వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్, పశువైద్యాధికారి విజయలక్ష్మి, ఏపీఓ నాగరాజు, విద్యుత్ ఏఈ వీర బ్రహ్మం, హౌసింగ్ ఏఈ హనుమంత రావు, పంచాయతీ ఏఈ వెంకటేశ్వర రావు ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు సభలో చదివి వినిపించారు. సభలో జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, వైస్ ఎంపీపీలు వేముల పద్మ, బంకా రమణమ్మ నాగిరెడ్డి, ఆయా ప్రాదేశికాల ఎంపీటీసీలు, గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.